కథ

# అమ్మకోర్కె

చొప్పదండి సుధాకర్

3-9-12, గౌతమబుద్ధ వీధి
శివాజీనగర్,
నిజామాబాద్-503 001.

**ఎలాగయితేనేం! చిట్ట చివరకు ఓ ఘనకార్యం సాధించాను! మీకది ఘనకార్యంలా తోచకపోవచ్చు! కానీ నామట్టుకు నాకది నిశ్చయంగా ఘనకార్యమే!**

సుమారుగా పదేళ్ళ నుండి ఉవ్విళ్ళూరుతోన్న నా కల ఇవాళ ఫలించింది. ఉగాది పర్వదినాన నేను మా ఊళ్ళో గడపగలుగుతున్నాను. నాకయితే ఓ గొప్ప మధుర స్వప్నం అవలోకిస్తోన్న అనుభూతి కలుగుతోంది.

నిజం చెప్పాలంటే ఉగాది అందాలు, ప్రకృతి ముస్తాబులు మా ఊళ్ళో చూసి తరించాల్సిందే!

ఓ చిన్నపాటి ఉద్యోగం చేస్తూ చేతికి మూతికీ తప్ప మరిదేనికీ కొరగాని గొర్రెతోక జీతంనాది. దానికి తోడు పెళ్ళాం పిల్లలూ కూడా ఉండడం వల్ల ఎప్పుడయినా ధైర్యం చేసి గుండె నిండా మంచి గాలి పీలుద్దామన్నా భయపడే ఆర్థిక పరిస్థితుల్లో వందరూపాయలకు తెగించి మావూరుకి పండగ గడపడానికి రావడం నా మట్టుకు నాకు గగనకుసుమమే.

ప్రయాణ ఛార్జీలు వంద మాత్రమే కాదు... నాలుగు రోజుల డ్యూటీ ఎగ్గొట్టినందుకు నాజీతంలో మరో నూటాయాభై కూడా కోత వేస్తాడు ఫ్యాక్టరీ సూపర్ వైజర్.

అమ్మ అస్తమానం నాతో పోరుతూ ఉంటుంది. ఆబోటి పనేదైనా ఇక్కడే ఇంటిల్లి పాదీ కష్టపడి చేసుకొంటే అంతకన్నా చక్కగా బతగ్గలరని హితబోధలు చేస్తూ ఉంటుంది. అమ్మ ఆరాటం అమ్మది.

నిజానికి మేము నలుగురం అన్నదమ్ములమయినా ఒక్కరం కూడా ఇంటి పట్టున ఉండక పోవడం ఆమెకి ఎంతయినా బాధేకదా? అరవయ్యేళ్ళ వయసులో ఒక్కతే వండుకోవడం, ఇళ్ళంతా శుభ్రం చేసుకోవడం, ఒక్కతే బిక్కుబిక్కుమని గడపడం ఆమెకి దుర్భరం, దుస్సహం కాక షరేమిటీ?

నేను చాలాసార్లు తీవ్రంగానే అనుకొన్నాను హైద్రాబాద్ నుండి మకాంఎత్తేసి మా ఊరికి తిరిగి వచ్చేద్దామనీ... కానీ కమల సాగనివ్వలేదు. కమలంటే ఎవరో కాదు... నా అర్థాంగి.

హైదరాబాద్‌లో ఉంటున్నామనే విషయం ఇతరులకు గొప్పగా చెప్పుకోవడం, తారురోడ్ల మీద నడవడం, ఆకాశాన్నంటే హర్మ్యాలను చూస్తూ ఆనందించడం, సినిమా పోస్టర్లు చూసి మురిసిపోవడం, సిటి బస్సుల్లో తిరగడం వంటి చర్యల్లోనే జీవిత పరమార్థం, ఆనందం ఉందని భ్రమపడే పసిపిల్ల మనస్తత్వంతో కొట్టుమిట్టాడే కమల ఎప్పటికప్పుడూ నాకోరికకి గొడ్డలి వేటు వేస్తూ వస్తుంటుంది. దరిమిలా, నా స్వగ్రామ పునరాగమన కార్యక్రమం వాయిదా పడుతూవస్తోంది.

“ఒరేయ్ ప్రసాద్! కాస్త వంటింట్లోకి ఓ కన్ను వేయరా! నేను అలావెళ్ళి, రామశేషు ఇంట్లో కాసిన్ని ఆకులూ, వేపపూవు తెస్తాను” అంటూ అమ్మవేసిన కేకతో వాకిట్లోంచి, వంటింట్లోకి వెళ్ళక తప్పలేదు నాకు.

నిజానికి అమ్మతేవడానికి వెళ్ళిన ఆ సరుకులన్నీ తెల్లవారు ఝామున్నే స్నేహితులతో పాటూ నేను వెళ్ళి తెద్దామని నిన్ననే నిశ్చయించుకొన్నాను. మా ఊళ్ళో నా చిన్ననాటి ‘ఫ్రెండ్స్’తో అడవికి వెళ్ళి ఆకులు తేవడం నాకో గొప్ప సరదా.



అయితే అమ్మ బొత్తిగా నా మాట సాగనివ్వలేదు. అలా అనేకంటే అమ్మ నేనొచ్చినప్పటి నుండీ ఇల్లు వదిలి కాలుబైట పెట్టనీకుండా అపురూపంగా, ఆప్యాయంగా, కంటికి రెప్పలా చూసుకొంటూందంటే బావుంటుందేమో!

వంటింట్లో పీటవేసుక్కూర్చున్నాను. మా ఇంట్లో ప్రతివస్తువుకీ ఓ చిన్నపాటి కథ ఉంది. ఈ పీటకుతోడు మరో పీట కూడా ఉంది. ఆ రెండు పీటలూ మా అమ్మమ్మ అమ్మకిచ్చిందిట. ఆ అమ్మమ్మ అమ్మ ఆమెకిచ్చిందిట. పెద్దపీట, తిరగలిరాయి, కుందెనలు, తాంబూలం పెట్టెలు, విసనకర్రలు అన్నీ మా అమ్మమ్మ ఇచ్చినవే అమ్మకు.

అదే పరంపర తన హయాంలో కొనసాగాలన్న ఉబలాటంతో వాటన్నింటినీ అక్కయ్య కిస్తే ఆమె మూతి మూడొంకర్లు తిప్పి ఇక్కడే పడేసి వెళ్ళింది. ఓ డబుల్ కాట్ డెకోలం మంచం, గోద్రెజ్ బీరువా ఇంకా చిన్నా చితకా ఫర్నిచర్ సామానంతా ఇస్తే ఈయండి లేకపోతే ఊరుకొండని మొహంమీదే తెగేసి చెప్పి మరీ వెళ్ళిపోయింది.

నిజమే పప్పురుబ్బుకోవడమే ఆడాళ్ళకు గగనమయిపోతున్న ఈరోజుల్లో ఇటువంటి సెంటి మెంట్లు ఆప్యాయతలు ఎవడిక్కావాలి?

నాకాసామాన్లని చూస్తూంటే గుండెంతా చిక్కపట్టింది. ఎన్నితరాల ఆప్యాయతలు, ఆపేక్షలు, జ్ఞాపకాలు, మధుర ఘట్టాలు గుండెల్లో నింపుకొని ఉన్నాయో అవి! వాటికి మాటలొస్తే గానీ తెలియదు మరి.

ఇప్పుడవి పురావస్తు ప్రదర్శన శాలల్లోకి తప్ప ఎందుకూ పనికిరావు. నిజమైన ఆప్యాయతలూ, ప్రేమలూ, మనం చూసి ఎన్నాళ్ళయింది?

'జీవితం ప్రస్తుతం వేగవంతమైంది' అనే ఒకే ఒక వాక్యం చాటున మనల్ని మనం ఎంత బాగా మోసగించుకొంటున్నాం!

నాకయితే ప్రస్తుతకాలానికి కూడా మనిషి మనిషిని ఈ మాత్రమైనా గుర్తించి మొహమాటానికయినా నవ్వగలుగుతున్నాడంటే అది నిజంగా నిన్నటి తరం ఇంకా బతికి ఉండబట్టేననిపిస్తుంటుంది.

అనురాగాలు, ఆప్యాయతలూ, అనుబంధాలూ కేవలం నిన్నటి తరంలోనే మిగిలిపోయాయి. ఆ తరం పల్లెల్లోనే ఉంది.

నేను మా ఊళ్ళో ఉన్న వారం రోజులూ అమ్మ నన్ను ఎన్నో విధాలుగా ప్రార్థించింది. మా ఊరికి తిరిగి రమ్మని బుద్ధులు చెప్పింది. అన్నీ విన్న నేను మౌనంగా ఉండడం తప్ప ఏమీ చేయలేకపోయాను.

అణువణువూ ఆప్యాయతల అనుభూతులు మూట గట్టుకొని నేను తిరిగి హైదరాబాద్ బస్ ఎక్కేశాను. అమ్మనన్ను కౌగిలించుకొని ఏడుస్తూంటే నెరిసిన ఓ తల వెంట్రుక నా షర్ట్ మీద పడింది. ప్చ్! అమ్మలాగే సంప్రదాయాలు, అభిమానాలు నెరిసిపోతున్నాయి. బస్ కదిలింది.

"మనం రేపే మన ఊరెళ్ళిపోతున్నాం! సామాన్లన్నీ ఒక్కచోట సర్దు" ముక్తసరిగా చెప్పాను.

కమల గయ్‌మంది. తాను చచ్చినా రానని మొరాయించింది. ఏడ్చింది, మొత్తుకుంది. వారం రోజులు ఇంట్లో ఎవరమూ సరిగ్గా భోంచెయ్యలేదు. నేను డ్యూటీకి వెళ్ళడం కూడా మానేశాను.

"పదండి! అక్కడే చద్దాం!" ఆఖరుకు ఒప్పుకోక తప్పలేదు కమలకు.

ఆ సాయంకాలమే మా ఊళ్ళో బస్ దిగాం సకుటుంబ సమేతంగా. అమ్మ ఆనందం అంతా ఇంతా కాదు. అయితే కమల మాత్రం అమ్మతో పొడిపొడిగానే మాట్లాడింది.

నాలుగయిదు రోజులు బాగా ఆలోచించి ఊళ్ళో ఇంగ్లీషు మీడియం స్కూల్ పెట్టాలని నిర్ణయించుకొన్నాను.

సరియైన స్కూలంటూ ఒకటి లేక ఊళ్ళో పిల్లలందరూ చెడిపోతున్నారని, 'వాళ్ళని సరియైన మార్గంలో నీవు మాత్రమే నడిపించగలవ'ని అందరూ అభినందించారు నన్ను.

నెలకూడా గడవక ముందే ఊళ్ళో స్కూల్ వెలిసింది. జ్ఞానజ్యోతి విద్యాలయంగా నామకరణం చేశాను స్కూలుకి. తీరిక వేళల్లో ఉచితంగా! వయోజనులకు విద్యాబోధన కూడా చేస్తున్నాను.

అయితే నా విజయం వెనక ఎంతోమంది ప్రముఖులున్నారు. మా ఊరు ప్రెసిడెంట్, నా చిన్ననాటి గురువయిన టీచరూ, నా హితులు, సన్నిహితులూ ఎందరో.. ఇంకా ఎందరో!

వీళ్ళందరే కాకుండా మా అమ్మ నాకోసం అమ్మిన నాలుగు కాసుల బంగారం గొలుసుకూడా ఉంది!

క్రమేపీ కమల కూడా ఏదిమంచో ఏది చెడో తెలుసుకొంది. నాకెంతో హాయిగా ఉంది.

మంచినీళ్ళ కోసం వంటింట్లోకి వెళ్ళిన నాకు అమ్మ ఏదో ఉత్తరం పట్టుకొని కళ్ళజోడు పెట్టుకొని చదవడానికి అవస్థపడడం కనిపించింది. ఎందుకో అమ్మనన్ను చూసి గర్వంగా నవ్వింది. నేనా ఉత్తరం అందుకొని చూశాను.

గ్రామీణ ప్రాంతాల్లో నా నిస్వార్థ సేవను శ్లాఘిస్తూ కలెక్టర్ గారు పంపిన ఉత్తరం అది. నేను చదివి అమ్మకు వినిపించానో లేదో!

ఇంతలో చప్పున కరెంట్‌పోయింది! చిమ్మచీకటి! అయితేనేం... మా అమ్మకళ్ళు వెలుగుతూనే ఉన్నాయి దేదీప్యమానంగా!★

